సాక్షి సిద్దిపేట

మంగళవారం : 30 : మే : 2023



సరిహద్దులో చెక్‌పోస్ట్

కర్ణాటక, మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందనే అనుమానంతో మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. 8లో..



కార్తెలో వరిసాగు చేసుకోండి

ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోకుండా ఉండేందుకు మృగశిర కార్తెలో వరి సాగు చేసుకోవాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ రైతులకు సూచించారు. 9లో..

తేనెటీగల పెంపకంపై శిక్షణ

ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల పరిశోధన కేంద్రం(ఎఫ్‌సీఆర్‌ఐ)లో ఐదో విడత కింద తేనెటీగల పెంపకంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలజ తెలిపారు. జూన్ 1 నుంచి 7 వరకు నిర్వహించే శిక్షణలో ఉచిత భోజన వసతితో పాటు ప్రయాణ భత్యం చెల్లించబడుతుందన్నారు. ఆసక్తిగల వారు డాక్టర్.వసీమ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మొబైల్ నంబర్ 7876531614ను సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

జిల్లా ఖజానా స్ట్రాంగ్‌రూం ప్రారంభం



స్ట్రాంగ్ రూమ్ వద్ద కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, తదితరులు

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా ఖజానా శాఖ సంబంధిత స్ట్రాంగ్ రూమ్‌ను సోమవారం అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ప్రారంభించారు. ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు అధునాతన పద్ధతిలో అత్యంత పకడ్బందీగా నిర్మించారు. కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ ఇన్‌చార్జి అధికారి జగదీష్ సింగ్, ఆర్అండ్‌బీ ఈఈ రాము, అధికారులు దితరులు పాల్గొన్నారు.

నిరసనకు తరలిన వీఓఏలు



తరలి వెళ్తున్న వీఓఏలు

సిద్దిపేటఅర్బన్: డిమాండ్ల సాధన కోసం వీఓఏలు హైదరాబాద్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమానికి జిల్లా నుంచి వీఓఏలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ వీఓఏల సమస్యలను ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడంలేదని వాపోయారు. వీఓఏ దీక్షలకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. హైదరాబాద్‌కు తరలి వెళ్లిన వారిలో సిద్దిపేట అర్బన్, రూరల్, నారాయణరావుపేట మండలాల అధ్యక్షులు రాజు, నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, నాయకులు వంశీ, సుష్మ, లావణ్య, చంద్రకళ, మంజుల, సుజాత, లావణ్య, హారిక, బాలమణి తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

చేర్యాల(సిద్దిపేట): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర వికలాంగుల వేదిక వ్యవస్థాపకుడు మేకల సమ్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సుతారి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో మాట్లాడారు. స్వయం ఉపాధి చేసుకునే దివ్యాంగులకు త్రీ వీలర్ వెహికిల్స్ ఇవ్వాలని, బ్యాంకుతో సంబంధం లేకుండా రుణాలు మంజూరుచేయాలని, పెన్షన్ అందేలా చూడాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు శాఖ, నాబార్డ్, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సహకారంతో నిరుద్యోగ యువతకు సీసీ కెమెరా, ఏసీ, రిఫ్రిజిరేటర్ రిపేర్‌పై ఉచిత శిక్షణ అందించనున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. 45 రోజుల శిక్షణలో భోజన వసతితో పాటు స్కిల్ ఇండియా ద్వారా సర్టిఫికెట్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని కోటిలింగాల టెంపుల్ ఆవరణలో జూన్ 1న ప్రారంభమయ్యే శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బోగస్ ఓటర్లపై ఫోకస్

- ఆరుగురు ఓటర్లు ఉన్న ఇళ్లల్లో సర్వే
- ఆధార్, అడ్రస్‌ను పరిశీలిస్తున్న బీఎల్‌ఓలు
- జిల్లాలో సుమారు 21,084 గృహాలు



జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌లో సర్వే చేస్తున్న బీఎల్‌ఓ

సాక్షి, సిద్దిపేట: సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో ఓటరు జాబితాపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంబోగస్ ఓటర్ల తొలగింపు ప్రక్రియను చేస్తుండగా, ఒకే ఇంటి నంబర్‌పై ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న గృహాలపై దృష్టిసారించింది. ఇందుకోసం క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ) ఇంటింటి సర్వే చేపట్టారు. ఓటర్ల ఆధార్ కార్డు, అడ్రస్‌తో సరిపోల్చుతూ పరిశీలన చేస్తున్నారు. ఆరు కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్న గృహాలు జిల్లాలో సుమారు 21,084 వరకు ఉన్నాయి.

జిల్లాలో 8.86లక్షల ఓటర్లు

- ఓటర్ల జాబితా సవరణను కేంద్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా చేపడుతోంది.
- జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 8,86,560 మంది ఓటర్లు ఉన్నారు.
- అందులో పురుషులు 4,40,192, స్త్రీలు 4,46,345, ఇతరులు 23 మంది ఉన్నారు.
- నియోజకవర్గం వారీగా హుస్నాబాద్‌లో 2,27,227, సిద్దిపేటలో 2,18,770, దుబ్బాకలో 1,87,892, గజ్వేల్‌లో 2,52,671 ఓటర్లు ఉన్నారు.
- డబుల్ ఓట్లను తొలగించేందుకు ఓటరు జాబితాకు ఆధార్ కార్డును అనుసంధానిస్తున్నారు.
- ఒకే ఇంట్లో ఆరు ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న గృహాలు జిల్లాలో 21,084 ఉండగా, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

నియోజకవర్గం	గృహాలు	ఓటర్లు
హుస్నాబాద్	4,691	38,350
సిద్దిపేట	5,686	50,765
దుబ్బాక	3,441	43,600
గజ్వేల్	7,266	67,673

- బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల అడ్రస్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.
- పోలింగ్ బూత్‌ల వారీగా ఓటరు జాబితాను పరిశీలిస్తూ బోగస్ ఓటర్లను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.
- జూన్ 20వ తేదీ వరకు సర్వే నిర్వహించి బీఎల్‌ఓలు పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నారు.
- ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు సవరణలపై దరఖాస్తులు తీసుకోవడంతో పాటు పలు మార్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇప్పటికే సమావేశాలు సైతం నిర్వహించారు.

జాబితా పక్కాగా ఉండేందుకే..

జిల్లాలో బోగస్ ఓటర్లను గుర్తించేందుకు ఈ సర్వే చేపట్టాం. ఒకే ఇంటి నంబర్‌పై ఆరు కంటే ఎక్కువ ఓటర్ల ఆధార్, అడ్రస్‌ను బీఎల్‌ఓలు వచ్చి తనిఖీ చేస్తారు. ఓటరు జాబితా పక్కాగా సిద్ధం చేసేందుకు ప్రజలు సహకరించాలి.

– విజయ్ సాగర్, తహసీల్దార్, సిద్దిపేట

ప్రగతి వివరించేలా దశాబ్ది వేడుకలు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేత

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: తొమ్మిదేళ్లలో వివిధ శాఖల్లో జరిగిన అభివృద్ధిని వివరించేలా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ శ్వేతతో కలిసి పాల్గొని మాట్లాడారు. జూన్ 2 నుంచి జూన్ 21 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పించి, అనంతరం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతిని వివరించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించామన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ మహేందర్, జెడ్పీ సీఈఓ రమేష్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీఓ చంద్రమోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి మురళి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.కాశీనాథ్, డీఎఫ్‌ఓ శ్రీనివాస్, ఏడీఏ శివప్రసాద్, ఉద్యానవన అధికారి సునిత, డీపీఓ దేవకిదేవి, డీపీఆర్‌ఓ రవికుమార్ పాల్గొన్నారు.

'సుడా' ప్లాట్స్‌కు బహిరంగ వేలం



వేలంలో పాల్గొన్న ఆశావహులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట అర్బన్ డేవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఆధ్వర్యంలో మిట్టపల్లి వద్ద చేపట్టిన మోడల్ లేఔట్‌లో ప్లాట్స్‌కు సోమవారం విపంచి ఆడిటోరియంలో బహిరంగ వేలం నిర్వహించారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న వేలంలో తొలిరోజు 14 ప్లాట్స్‌కు వేలం నిర్వహించగా, ప్లాట్ నంబర్ 55కు గజం రూ.9,100ల ధర పలికింది. ఈ ఓపెన్ యాక్షన్‌కు ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగా వచ్చింది. సుడా ఆధ్వర్యంలో 14 ఎకరాల్లో మొత్తం 101 ప్లాట్స్‌తో మోడల్ లేఔట్ సిద్ధం చేసిన అధికారులు గజం ధర రూ.8,000లతో ప్రారంభించారు. మొదటి రోజు 37 మంది వేలంలో పాల్గొన్నారు. ఒక ప్లాట్ మినహా మిగతా 13 ప్లాట్స్ నామమాత్రపు ధరకు దక్కించుకున్నారు. మంగళవారం రెండో రోజు వేలం కొనసాగుతుందని సుడా వైస్ చైర్మన్ రమణాచారి తెలిపారు.

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం

- పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత, పక్కన అడిషనల్ డీసీపీ మహేందర్, తదితరులు

సిద్దిపేటకమాన్: మహిళల రక్షణకు పోలీసులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. కమిషనరేట్‌లో సోమవారం సిద్దిపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులకు జెండర్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మహిళలకు వేధింపులు, గృహహింస సంబంధిత సమస్యలు ఉంటే స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్‌కు పంపించాలని, గ్రామాల్లో వీటిపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ శివకుమారి మాట్లాడుతూ కేర్ టేకర్, పోలీసులు, న్యాయవాదులు, వైద్యారోగ్య, విద్య, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్, సివిల్ సొసైటీ ఆర్గనైజర్లు, ఇతర శాఖల అధికారులు బాధిత మహిళలకు సాయం అందించడంలో తక్షణం స్పందించాలన్నారు. మహిళలపై జరుగుతున్న జరుగుతున్న నేరాలపై కేసులు నమోదు చేసి న్యాయం దక్కేలా చూడాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, మహిళా పోలీస్ స్టేషన్ దుర్గ, ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతరాణి, సిబ్బంది వసంత, సుశీల, స్వరూప, భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల విజయవంతానికి సహకరించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

గజ్వేల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. సోమవారం గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జూన్ 2 నుంచి 22వరకు జరిగే దశాబ్ది ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రణాళికాబద్ధంగా వేడుకలను నిర్వహించాలన్నారు. ప్రొటోకాల్ పాటిస్తూ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ, సహకార సంఘాలు, ఆత్మకమిటీలు, ఆలయాల కమిటీల డైరెక్టర్లను కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణలో మహిళలు పాల్గొనాలని కోరారు. సమీక్షలో గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్ ఆర్‌డీఓ విజయేందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, నీటి పారుదల శాఖ ఎస్ఈ వేణు, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ ఎంపీపీ అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం లేకుండా ఎజెండానా?

- చైర్మన్ తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం
- వాడీవేడిగా గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సమావేశం



కమిషనర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గ సమావేశం రసాభాసగా సాగింది. సోమవారం చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కౌన్సిలర్లు టేబుల్ ఎజెండాలపై మండిపడ్డారు. తమకు కనీసం సమాచారం లేకుండా 6వ వార్డులోని ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి రూ.4లక్షలు, 2వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13లక్షలు, 5వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి రూ.10లక్షలు, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు రూ.5లక్షలు, 4వ వార్డులో రోడ్డు ఫార్మేషన్ కోసం మరో రూ.4లక్షలు ప్రతిపాదిస్తూ అప్పటికప్పుడు చైర్మన్ రాజమౌళి టేబుల్ ఎజెండా తయారు చేయించారని ఆరోపించారు. తమకు సమాచారం లేకుండా రూపొందించిన ఈ ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. దీంతో సమావేశంలో వీటిని ఎజెండా నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో కౌన్సిలర్లు శాంతించారు.

5 లక్షల మందికి కంటి పరీక్షలు

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్

సిద్దిపేటకమాన్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 5,03,116 (111.3శాతం) మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. 34 వైద్య బృందాల ద్వారా పరీక్షలు నిర్వహించి, 90,596 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, 79,885 మందికి అద్దాలు ఆర్డర్ పెట్టినట్లు పేర్కొన్నారు.

పరీక్షల్లో రాణించేందుకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): పోటీ పరీక్షలలో రాణించేలా యువతను తీర్చిదిద్దేందుకే రాజీవ్ గాంధి యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ డీసీసీ కార్యదర్శి వెన్నం రాజమల్లు తెలిపారు. బెజ్జంకిలో ఆన్‌లైన్ క్విజ్ పోటీల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన యువత ఫేస్‌బుక్ లాంటి మాధ్యమాల్లో లీనమై పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నుంచి 35 సంవత్సరాల యువతి యువకులు అర్హులని ఆసక్తి గల వారు 7661899899కు మిస్‌కాల్ ఇచ్చి లింక్ పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి రవీందర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

కేతకిలో భక్తుల పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజావాణికి 57 దరఖాస్తులు

సిద్దిపేటరూరల్: వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చి అర్జీలపై సత్వరం స్పందించి పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్‌ఓ లక్ష్మీకిరణ్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉండి సమస్యలను విన్నవించుకుని, పరిష్కరించుకునేందుకు ప్రజావాణి చక్కని వేదిక అన్నారు. ఇక్కడికి వచ్చేవారికి న్యాయం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. భూ సంబంధిత, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఆసరా పింఛన్లు తదితర వాటిపై 57 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

డబుల్ రిజిస్ట్రేషన్ చేశారు



మాది తొగుట మండలం ముంపు గ్రామం పల్లెపహాడ్. ప్రభుత్వం ముంపు బాధితులకు కేటాయించిన ప్లాట్ నంబర్ 339ను కేటాయించి అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. 20 రోజుల తర్వాత ఇదే ప్లాట్‌ను మరో వ్యక్తి పేరున రిజిస్ట్రేషన్ చేశారు. అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్‌ను తిరిగి ఇప్పించండి.

– కొమ్ము, భూపాల్, పల్లెపహాడ్

భూమిని ఇప్పించండి



దుబ్బాక మండలం చీకోడు గ్రామంలో నాకు, నా తమ్ముడు పోచయ్యకు కలిపి సర్వే నంబర్ 1183/ఇలో 10 గుంటల భూమి ఉంది. దీనిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి అక్రమంగా పట్టా చేయించుకున్నాడు. ఈ విషయమై అధికారులను కలిసినా న్యాయం దక్కలేదు. ఉన్నతాధికారులు స్పందించి భూమి ఇప్పించాలి.

– వనం కనకయ్య, చీకోడు

ప్లాటు అందించాలి

మాది కొండపాక మండలం దుద్దెడ గ్రామం. సర్వే నంబర్ 663లో 30 గుంటల భూమిని రెవెన్యూ అధికారుల భూసేకరణ కింద తీసుకుని చెక్కు, ప్లాటు ఇస్తానన్నారు. చెక్కు ఇచ్చారు కాని ఇప్పటివరకు ప్లాటు ఇవ్వలేదు. త్వరగా అందించేలా చూడాలి.

– పిల్లి అశ్వద్దామ, దుద్దెడ





తోటపల్లి రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

తూకమైన ధాన్యం తీసుకోవాలని..

బెజ్జంకి(సిద్దిపేట): కొనుగోలు కేంద్రంలో తూకమైన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తోటపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేశారు. అలాట్‌మెంట్ పూర్తయిందనే సాకుతో ధాన్యాన్ని నిరాకరిస్తున్నారని వారు మండిపడ్డారు. ఎస్‌ఐ ప్రవీణ్‌రాజ్ అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. అధికారులు, మిల్లర్లతో మాట్లాడి ధాన్యం తీసుకునేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



అక్బర్‌పేట భూంపల్లి రోడ్డుపై..

లారీలు పంపాలని..

దుబ్బాకరూరల్: ధాన్యం లోడ్ ఎక్కించడానికి లారీలను పంపాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం అక్బర్‌పేట భూంపల్లి మండలం నగరం చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. లారీలు రాక ధాన్యం ఎక్కడికక్కడ నిలిచి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినప్పటికి పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి లారీల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాతో సుమారు గంట పాటు వాహనాలు నిలిచి పోయాయి.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

కొండపాక(గజ్వేల్): మద్యం తాగి వాహనాలు నడిపిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం..త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 10 మంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని పట్టుకున్నట్లు ఆయన చెప్పారు. వారిని కోర్టులో హాజరు పరచగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు 10 మందికి జరిమానాతో పాటు ఒకరికి ఒక్క రోజు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

వీఓఏల అరెస్ట్

చిన్నకోడూరు(సిద్దిపేట): వీఓఏల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా సోమవారం చలో హైదరాబాద్ చేపట్టారు. చిన్నకోడూరు నుంచి వీఓఏలు హైదరాబాద్‌కు వెళ్తుండగా పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు'

బెజ్జంకి(సిద్దిపేట): వరి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిశాని రామచంద్రం ఆరోపించారు. బెజ్జంకిలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన పంటలో చీడ పీడలు పోను మిగిలిన ధాన్యం అమ్ముకోలేని దుస్థితి మన రాష్ట్రంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి బాలయ్య, అసెంబ్లీ అధ్యక్షుడు బొనగిరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, మండల అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 17 మంది ఎంపిక

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎన్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపల్ చెన్నూరి శ్రీనివాస్ కంపెనీ ప్రతినిధులు బ్రహ్మారెడ్డి, విజయ్, జయప్రకాశ్‌నారాయణ రాతపరీక్షను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ సబ్జెక్ట్‌తో పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇది చక్కని అవకాశమన్నారు. ఇంటర్వ్యూల అనంతరం 15మంది బాలురు, ఇద్దరు బాలికలను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రతినిధి మోహన్ చెప్పారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

హుస్నాబాద్: బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. మోదీ అధికారంలో వచ్చిన తర్వాత ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ప్రతిపక్ష నాయకులపై ఈడీ, ఐటీ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలను ఆకర్షించడానికి అనేక పథకాలను ప్రకటించి, అధికారం వచ్చాక ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ గర్జన విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశ్, నాయకులు వనేష్, సత్యనారాయణ, బద్దిపడగ రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

సరిహద్దులో చెక్‌పోస్ట్



రాష్ట్ర సరిహద్దులో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు

జహీరాబాద్: రాష్ట్ర సరిహద్దు వద్ద వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలు రాకుండా ఉండేందుకుగాను ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందనే అనుమానంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. సోమవారం చెక్‌పోస్టు పనితీరును డీఎస్పీ రఘు పరిశీలించారు. చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్, మొగుడంపల్లి మండల ఏఓ వినోద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు.

సోయాబీన్ విత్తనాల సీజ్

అక్రమంగా నిల్వచేసిన 200 సోయాబీన్ బస్తాలను వ్యవసాయశాఖ, పోలీసు అధికారులు సోమవారం సీజ్ చేశారు. చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్, మండల వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మొగుడంపల్లి మండలం ధనాసిరి గ్రామంలో ఒగ్గి సిద్ధన్న తన ఇంట్లో అనధికారికంగా హీరామోతి కంపెనీకి చెందిన సోయాబీన్ విత్తనాలు నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు అతడి ఇంటిలో సోదాలు చేసి విత్తనాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం వారు మాట్లాడారు. ఎవరైనా అనధికారికంగా విత్తనాలను అధిక మొత్తంలో నిల్వచేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.



విత్తనాలను సీజ్ చేస్తున్న ఎస్ఐ కాశీనాథ్, ఏఓ వినోద్‌కుమార్

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి

జిల్లా అధ్యక్షుడు శేషం శ్రీనివాసాచార్యులు

గజ్వేల్‌రూరల్: బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని బ్రాహ్మణ సేవావాహిణి జిల్లా అధ్యక్షుడు శేషం శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ బ్రాహ్మణుల కోసం బ్రాహ్మణ పరిషత్‌ను ఏర్పాటు చేసి విద్య, ఉద్యోగ, వ్యాపార అవకాశాలను కల్పిస్తున్నారని తెలిపారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా వివేకానంద ఓవర్ స్కీమ్స్ కోసం 780 మంది విద్యార్థులకు రూ.76.67 కోట్లను మంజూరు చేశారని, వ్యాపారాలను ప్రోత్సహిస్తూ బెస్ట్ స్కీమ్ కింద 5074 మంది పేద బ్రాహ్మణ కుటుంబాలకు రూ. 50 కోట్ల ఆర్థికసాయం సబ్సిడీ రూపంలో అందజేసినట్లు గుర్తు చేశారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవం ఉమ్మడి మెదక్ జిల్లా ఆలయ అర్చక, ఉద్యోగస్తులు, దూప దీపనైవేద్య అర్చకులు హాజరుకావాలని జేఏసీ నాయకులు అన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో జిల్లా అర్చక ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కలకుంట్ల కృష్ణ మాచార్యులు, కలకుంట్ల వెంకట నరసింహచార్యులు, చంద్రకుమార్‌లు మాట్లాడుతూ ఈ నెల 31 రంగారెడ్డి జిల్లాలో రూ.12కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చక కార్యదర్శి సిహెచ్ వెంకట నరసింహచార్యులు, రాజు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు జైలు

సిద్దిపేటకమాన్: భార్య మృతికి కారణమైన భర్తకు సిద్దిపేట కోర్టు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు, రూ.1000 జరిమానా విధించింది. సిద్దిపేట టూ టౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నాందేడ్‌కు చెందిన వాగమరే మాధవ్(40) సిద్దిపేట పట్టణం, వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నాడు. మాధవ్‌కు 2013లో అదే ప్రాంతానికి చెందిన వాంగ్ మారే రాధతో వివాహం జరిగింది. వీరికి రెండున్నర సంవత్సరాల కుమారుడు కలడు. ఐదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నాందేడ్ నుంచి సిద్దిపేట పట్టణానికి వచ్చి లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కాగా మాధవ్ రోజు మద్యం తాగి ఇంట్లో భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో 2018 ఆగస్టు 22వ తేదీన మాధవ్ మద్యం సేవించి భార్యతో గొడవపడి ఆమెను తీవ్రంగా కొట్టడంతో రాధ మృతి చెందింది. తన కూతురి మృతికి అల్లుడు మాధవ్ కారణమని మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ సాంబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ సెషన్స్ కోర్టులో కేసు విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందునా జడ్జి రఘురాం అతనికి10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్‌లింగం, టూ టౌన్ సీఐ రవికుమార్, కోర్టు కానిస్టేబుల్ యాదగిరి, కోర్టు లైజనింగ్ ఏఎస్ఐ స్వామిదాస్‌లను సీపీ శ్వేత అభినందించారు.

'సవాళ్లను అధిగమిస్తేనే వ్యవస్థాపకులుగా రాణింపు'

పటాన్‌చెరు టౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యవస్థాపకులుగా రాణించాలంటే, నిత్యం ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమిస్తూ, సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే సాధ్యపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ (రుద్రారం లోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ) నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మర్ స్టార్టప్ స్కూల్‌లో భాగంగా సోమవారం కార్పొరేట్ కనెక్ట్, స్టార్టప్ సిమ్యులేటర్ కార్యక్రమాలను నిర్వహించారు. స్టార్టప్-కార్పొరేట్ ప్రపంచాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వారు తమ అనుభవాలు, నైపుణ్యాలను విద్యార్థులకు వివరించారు. స్టార్టప్ - కార్పొరేట్ పర్యావరణ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఆవిష్కరణ, వ్యవస్థాపకత, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, స్టార్టప్ - కార్పొరేట్ ఎకోసిస్టమ్ అంశాలను వివరించారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

సిద్దిపేటజోన్: వీధి వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన తినుబండారాలను విక్రయించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్స్ అన్నారు. సోమవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ సహకారంతో ఫుడ్ సేఫ్టీ అథారిటీ వీధి వ్యాపారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి వ్యాపారులు నిల్వ ఉంచిన పదార్థాలను విక్రయించరాదని సూచించారు. ఇలాంటి విషయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ప్లాస్టిక్ వాడకుండా స్టీల్ సామగ్రి వాడాలని సూచించారు. నాణ్యతా పరీక్షలను నిర్వహించి గుర్తింపు సర్టిఫికేట్ కలిగిన వంట నూనెలను వాడాలన్నారు. కల్తీ నూనెలతో తయారు చేసే తిను బండారాలు ప్రజల ఆరోగ్యాన్ని హాని కలిగిస్తాయన్నారు.

వేసవి శిబిరాలతో నైపుణ్యం పెంపు

సిద్దిపేట జిల్లా అదనపు జడ్జి భవాని

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు మూస పద్ధతిలో కాకుండ ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని, వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందుతుందని జిల్లా అదనపు న్యాయమూర్తి భవాని అన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరా నగర్ ప్రభుత్వ హైస్కూల్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వేసవి శిబిరాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మాతృభాషను గౌరవిస్తూ ఇతర భాషలపై పట్టుసాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఫకృద్దీన్, జేవీవీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, సభ్యులు సాదత్ అలీ, మహేందర్, కిషోర్, రవి, హుమామాన్ జాంగిర్, స్కూల్ హెచ్ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతో మనసుకు ప్రశాంతత

దుబ్బాకటౌన్: భగవన్నామ స్మరణతో మనసుకు ప్రశాంతత కలుగుతుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని హసన్‌మీరాపూర్‌లో గొల్లకుర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలతో ప్రజలు సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం హసన్‌మీరాపూర్‌లో హనుమాన్ ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గొల్లకుర్మ సంఘం నాయకులు ఉన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్‌గా ఎంపిక

సిద్దిపేటఎడ్యుకేషన్: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు టెక్నికల్ అసిస్టెంట్‌గా సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యుడు కల్లపల్లి కృష్ణకుమార్ ఎంపికయ్యారు. హైదరాబాద్ గచ్చీబౌలీ స్టేడియంలో ఈనెల 30, 31 తేదీల్లో జరగనున్న పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, కరోల్ల వెంకటస్వామిగౌడ్, డీవైఎస్ఓ నాగేందర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయి రామ్, క్రీడా సంఘాల బాధ్యులు రవీందర్‌రెడ్డి, కనకరెడ్డి శ్రీనివాసులు, రామేశ్వర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి ఆత్మహత్య

క్షణికావేశంలో బాలిక..

కొమురవెల్లి(సిద్దిపేట): క్షణికావేశంలో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన పొట్ల చెరువు మల్లేశంకు ఒక కూతురు సంధ్య(14), కుమారుడు మహేశ్ ఉన్నారు. తల్లి దండ్రులు ఇద్దరు పనికి వెళ్లిన తర్వాత ఆల్మారలోని బట్టలు సర్దే విషయంలో అక్క, తమ్ముడు గొడవపడ్డారు. అనంతరం తమ్ముడు మహేష్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో ఆ బాలిక క్షణికావేశంలో తన చున్నితో ఇంట్లో సజ్జకు ఉరివేసుకుంది. ఇంతలోనే పనులు ముగించుకొని ఇంటికొచ్చిన తల్లి తలుపులు వేసి ఉండడంతో కిటికిలోనుంచి తొంగి చూడగా తన కూతురు ఉరివేసుకొని కనిపించింది. ఆందోళనకు గురైన తల్లి చుట్టుపక్కల వారిని పిలిచింది. వారొచ్చి తలుపులు పగలగొట్టి చూశారు. అప్పటికే సంధ్య మృతి చెందిందని వారు నిర్ధారించుకున్నారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..


మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లికి చెందిన మస్కూరి యాదగిరి (40) మొదటి భార్య అనారోగ్యంతో చనిపోవడంతో మండలంలోని లింగారెడ్డిపేటకు చెందిన రాణిని రెండో వివాహం చేసుకున్నాడు. సొంత ఊరిలో పనులు లేకపోవడంతో అత్తగారి ఊరైన లింగారెడ్డిపేటకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా కొన్ని రోజులుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు ప్రవీణ గమనించి తల్లికి, చుట్టుపక్కల వారికి చెప్పడంతో వారు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు.



యాదగిరి (ఫైల్)

తండ్రి మందలించాడని..


మనోహరాబాద్(తూప్రాన్): మద్యానికి బానిస కావొద్దని తండ్రి మందలించడంతో కుమారుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన మండల పరిధిలో సోమవారం జరిగింది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాయపల్లికి చెందిన సర్పంచ్ రావెల్లి పార్వతి మల్లేశ్‌ల కుమారుడు రావెల్లి భాస్కర్ (21) స్థానిక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. 15 రోజుల క్రితం తన బాబాయ్ గుండెపోటుతో మృతి చెందడంతో అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఇదే విషయమై తల్లిదండ్రులు కుమారుడిని ఆదివారం రాత్రి మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన భాస్కర్ సోమవారం ఉదయం మండలంలోని పాలాట వద్ద ట్రైన్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించారు.



భాస్కర్ (ఫైల్)

చెరువులో పడి..

చేగుంట(తూప్రాన్): చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నార్సింగి గ్రామానికి చెందిన ఉప్పల శరత్(45)కు తూప్రాన్ మండలంలోని తాతపాపన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. శరత్‌తో విభేదాలు రావడంతో భార్యాపిల్లలు పుట్టింటికి వెళ్లిపోయారు. దీంతో శరత్ రెడ్డిపల్లిలో తన తల్లి లక్ష్మమ్మతో కలిసి ఉంటూ కూలీపనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం తల్లితో గొడవపడి బయటకు వెళ్లిపోయాడు. దీంతో శరత్ కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో సోమవారం స్థానిక చెరువులో మృతదేహం తేలడంతో బయటకు తీయగా మృతుడు శరత్‌గా గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.



శరత్ మృతదేహం



వశిష్ట పరంపర ఆధ్యాత్మిక ట్రస్ట్ (గోకులాశ్రమం)

గోకులాశ్రమాన్ని రక్షించండి

ట్రస్ట్ వ్యవస్థాపకుడు మధుసూదనరావు

సిద్దిపేటఅర్బన్: ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో ట్రస్టును ఏర్పాటు చేసి క్రియ యోగా, ధ్యానం, ధర్మ మార్గాలను బోధిస్తున్న తమపై గ్రామస్తులు కొందరు దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని, ఆశ్రమ స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని వెల్కటూరు గ్రామంలోని వశిష్ట పరంపర ఆధ్యాత్మిక ట్రస్ట్ (గోకులాశ్రమం) వ్యవస్థాపకులు యద్దనపూడి మధుసూదనరావు అన్నారు. సోమవారం ఆశ్రమంలో ఆయన మాట్లాడుతూ గోకులాశ్రమం ఆస్తులను కాపాడాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి ఆశ్రమంలోనే ఆమరణ నిరాహార దీక్షకు దిగగా స్థానిక నాయకులు సమస్య పరిష్కరిస్తామని నచ్చజెప్పి వారి చేత దీక్ష విరమింపచేసినట్టు తెలిపారు. వారు ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు ఒకే పూట ఆహారం తీసుకుంటూ 17 రోజులుగా దీక్ష కొనసాగిస్తున్నట్టు పేర్కొన్నరాఉ. ఉద్యోగాలు వదిలిపెట్టి భార్య సరళతో కలిసి వెలకటూరులో 2012లో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నామని, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆశ్రమం ఏర్పాటు చేసే సమయంలో ఆశ్రమ స్థలంలోనే వీరభద్రస్వామి రాతి ప్రతిమ చెట్టు కింద ఉందని, ఆశ్రమంతో పాటు ఆలయ జీర్ణోద్ధరణ చేసినట్టు తెలిపారు. ఆశ్రమం, గుడి ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని కలిపి ప్రహరీ నిర్మించి, గేటు పెట్టడానికి ప్రయత్నించగా గ్రామస్తులు కొందరు అడ్డుకున్నారని, ఆశ్రమం విడిచి వెళ్లాలని బెదిరించినట్టు తెలిపారు. ట్రస్టుగా ఏర్పాటు సమయంలో నలుగురు వ్యక్తులను ధర్మకర్తలుగా ఎన్నుకున్నామని, వారు చేసిన అక్రమాలు తెలియగా, వారిని రాజీనామా చేయించి బయటకు పంపివేశామన్నారు. దీంతో కోపం పెంచుకున్న సదరు వ్యక్తులు ఆశ్రమాన్ని వారి చేతుల్లోకి తీసుకోవాలనే ఉద్దేశ్యంతో మరి కొందరితో కలిసి దౌర్జన్యానికి దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అధికారులు, నాయకులు స్పందించి ఆశ్రమాన్ని కాపాడాలని కోరారు.



ఆశ్రమ వ్యవస్థాపకులు మధుసూదనరావు దంపతులు

ఇసుక మాఫియాను అడ్డుకోవాలి

ప్రజావాణిలో సర్పంచ్ ఫిర్యాదు

నంగునూరు(సిద్దిపేట): అర్ధరాత్రి పూట ఇష్టారీతిగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అక్కెనపల్లి సర్పంచ్ శ్రీమంతుల వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని అధికారులకు చెప్పినా పటించుకోవడం లేదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా అక్రమ రవాణా ఆగకపోవడంతో ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగేంద్రం, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, కర్ణాకర్, తదతరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, రైతులు

హలో నేను ఎస్ఐని మాట్లాడుతున్నా..

డబ్బులు పంపాలంటూ.. ఫోన్ కాల్స్

చేర్యాల(సిద్దిపేట): నేను ఎస్ఐని మాట్లాడుతున్నా.. డబ్బులు పంపండి అంటూ.. చేర్యాల, కొమురవెల్లి మండల పరిధిలోని పలు ఇంటర్నెట్, మినీబ్యాంక్ సెంటర్ల నిర్వాహకులకు రెండురోజులుగా గుర్తుతెలియని వ్యక్తి నుంచి వాట్సాప్ కాల్ రావడం చర్చనీయాంశమైంది. ఎస్ఐని అని చెప్పి డబ్బులు అడగడంతో ఆయా కేంద్రాల నిర్వాహకులు ఆందోళనకు గురవుతున్నారు. బాధితులకు 8639214082 సెల్‌నంబర్ నుంచి వాట్సాప్ కాల్ చేసినట్లు వాట్సాప్ డీపీలో సదరు వ్యక్తి ఫొటో పోలీస్ డ్రెస్‌లో ఉందని తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఏడుగురికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి సోమవారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాలకత్వ గ్రామానికి చెందిన బయానా మహేశ్(30) కౌడిపల్లిలో భార్య రాణిని తీసుకువచ్చేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లి తిరిగి రాత్రి తన బైక్‌పై వెలుతున్నాడు. 765డి జాతీయ రహదారిపై నాగ్సాన్‌పల్లి అటవీప్రాంతంలోని హనుమాన్ ఆలయం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు, బైక్ ఢీకొన్నాయి. మహేశ్‌కు తీవ్రగాయాలవ్వడంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో సంగారెడ్డి ఆసుపత్రికి పంపించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. మృతుని తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మహేశ్ మృతదేహం

ఇద్దరికి గాయాలు

కల్హేర్(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. కల్హేర్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ కథనం ప్రకారం..కామారెడ్డి జిల్లా బ్రహ్మణపల్లికి చెందిన హన్మండ్లు, శ్రీనివాస్ మోటర్ సైకిల్‌పై సోమవారం బాచేపల్లి నుంచి ఇంటికి వెళుతుండగా ఇందిరానగర్ తండాకు చెందిన అజ్మీరా శ్రీకాంత్ బైక్‌పై ఎదురుగా వచ్చి మాసాన్‌పల్లి చౌరస్తా సమీపంలో ఢీకొట్టాడు. దీంతో హన్మండ్లు, శ్రీనివాస్‌లకు గాయాలయ్యాయి. బందరి అవినాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. శివ్వంపేట్ మండలం దొంతి గ్రామానికి చెందిన బాలగారి భాస్కర్(21), శభాష్‌పల్లి గ్రామానికి చెందిన పానగారి నరేష్‌లు ఆదివారం తమ బైక్‌పై జీడిపల్లి వద్ద ఐటీసీ పరిశ్రమలో పని చేయడానికి వెళ్లారు. విధులు ముగిసిన తర్వాత మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్‌లో కాంట్రాక్టర్ సాయిని కలవడానికి వెళ్లి రాత్రి ఇంటికి బైక్‌పై వస్తుండగా కాళ్లకల్ వద్దకు రాగానే రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ దిమ్మను వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో భాస్కర్ అక్కడిక్కడే మృతి చెందగా నరేష్‌కు కాలు, చేయి విరిగాయి. గమనించిన స్థానికులు అతనిని కొంపల్లి ఆస్పత్రికి తరలించారు. భాస్కర్ మృతితో దొంతిలో విషాదచాయలు అలుముకున్నాయి.



భాస్కర్ (ఫైల్)

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

సిద్దిపేటరూరల్: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి పలువురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని రావురూకుల వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగోంది గ్రామానికి కొందరు దుబ్బాక మండల పరిధిలోని హబ్షీపూర్‌లో ఓ వేడుకకు వెళ్లారు. సాయంత్రం ఆటోలో గుర్రాలగోంది గ్రామానికి తిరిగి వస్తున్నారు. రావురూకుల గ్రామం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న బక్కలింగయ్య, దుర్గయ్య, జ్యోతి, భాగ్య మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డవారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన నూకల రాంరెడ్డి భార్య జ్యోతితో కలిసి ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి వెళ్తుండగా కమిషనరేట్ సమీపంలో రాజీవ్ రహదారిపై వెనక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన రాంరెడ్డి పక్కటెముకలు విరిగిపోగా, చేతులు, కాళ్లకు, జ్యోతికి కంటికి, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాంరెడ్డి మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.